

## ఇది.. తహసీల్ కార్యాలయమే..



నిజామాబాద్ రూరల్ మండలానికి చెందిన తహసీల్ కార్యాలయం ఇది. నగరంలోని లక్ష్మీప్రియనగర్ కాలనీలో ఉన్న ఓ ప్రైవేటు భవనంలో కొనసాగుతున్నది. ప్రధాన రహదారికి పక్కనే ఉన్నా.. ఇక్కడ కార్యాలయం ఉన్నట్లు ఎలాంటి గుర్తులు లేకపోవడం విశేషం. కార్యాలయానికి సంబంధించిన బోర్డు ఉన్నా అక్షరాలు సరిగ్గా లేకపోవడంతో ఇది తహసీల్ కార్యాలయమేనా? అన్న సందేహం ప్రజల్లో కలుగుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



దొడ్డికొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

## దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి

కామారెడ్డి, జూలై 4: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య అని, తరాతలకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం దొడ్డికొమురయ్య చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆయన అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీనివాస్, ఎస్సీ వెల్ఫేర్ అధికారి రజిత, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి,కార్యదర్శి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## ధరణిపై అలసత్వం వహించొద్దు

■ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఆర్మూర్ టౌన్, జూలై 4: ధరణి దరఖాస్తుల పరిష్కారంలో అలసత్వానికి తావు లేకుండా యుద్ధప్రాతిపదికన పరిశీలన ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. ఆర్మూర్ తహసీల్ కార్యాలయాన్ని గురువారం సందర్శించిన కలెక్టర్.. ధరణి దరఖాస్తుల పరిశీలన, వాటి పరిష్కారం తీరుపై స్థానిక రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఆర్మూర్ మండల పరిధిలో ఆయా మాడ్యూల్స్‌లో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల వివరాలు తెలుసుకున్నారు. ఎక్కువ సంఖ్యలో ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ధరణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని నెల రోజులుగా సూచిస్తున్నప్పటికీ ఎందుకు శ్రద్ధ చూపడం లేదని అధికారులను ప్రశ్నించారు. స్పెషల్ డ్రైవ్ చేపట్టి పెండింగ్ దరఖాస్తులన్నింటినీ క్లియర్ చేయాలని ఆదేశించారు. తప్పిదాలకు ఆస్కారం లేకుండా వాస్తవ పరిస్థితులతో కూడిన నివేదికను నిబంధనలకు అనుగుణంగా రూపొందించి ఆర్డీవో లాగిన్‌కు ఫార్వర్డ్ చేయాలన్నారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించిన ప్రగతిపై రోజువారీగా నిశితంగా పరిశీలించాలని ఆర్డీవోకు సూచించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, సంబంధిత అధికారులున్నారు.

# అమాత్యుడు లేక ఆగమాగం

- యంత్రాంగానికి దిశానిర్దేశం కరువు
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో శూన్యత
- ఆరు నెలలుగా మంత్రి లేకుండానే పాలన
- పత్తాలేని ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు
- విస్తరణపై గంపెడాశతో పలువురు పీసీసీ నేతలు
- యంత్రాంగంపై పట్టు సాధించని ఎమ్మెల్యేలు



నిజామాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో విచిత్రమైన పరిస్థితి నెలకొన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఆరు నెలలు దాటింది. అయినా జిల్లాకు పెద్ద దిక్కుగా ఉండాల్సిన మంత్రి పదవి ఎవ్వరికీ ఇవ్వలేదు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో ఈ ప్రాంతం తీవ్రమైన నిర్లక్ష్యానికి గురవుతుండడంపై సొంత పార్టీలోనే రుసరుసలు వినిపిస్తున్నాయి. అర్హత కలిగిన నాయకులు ఉన్నప్పటికీ ఈ ప్రాంతం నుంచి కేబినెట్‌లోకి ఎవ్వరినీ తీసుకోకపోవడం చర్చనీయాంశమైంది. ఆశలు పెట్టుకున్న నేతలంతా మంత్రివర్గంలో చోటు కోసం ఢిల్లీస్థాయిలో పైరవీలు చేసినట్లు తెలిసింది. నేతలంతా రాజధానుల్లోనే మకాం వేయడంతో ఉమ్మడి జిల్లా పరిపాలన కుంటుపడుతున్నది. ప్రభుత్వ పథకాల అమలుతోపాటు పరిపాలనను సవ్యదిశలో పెట్టాల్సిన నేతలు చేతులెత్తేయడంతో ప్రభుత్వ శాఖల్లో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు పరిస్థితి మారిపోయింది.

### పదవులపైనే యావ.. ప్రజలు పట్టరా..?

ఏటా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందే గత కేసీఆర్ ప్రభుత్వంలోని మంత్రులు, ఎమ్మెల్యేలంతా ఉమ్మడి సమీక్ష నిర్వహించి యంత్రాంగానికి సలహాలు, సూచనలు ఇచ్చేవారు. ఉమ్మడి జిల్లాలో మొన్న జరిగిన యాసంగి ధాన్యం సేకరణలో అలాంటి సమీక్షా సమావేశమే జరుగలేదు. ఇన్‌చార్జి మంత్రి తొలుత కేవలం మైనింగ్ శాఖ, ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణపైనే సమీక్షించి వెళ్లిపోయారు. తదనంతరం కీలకమైన ధాన్యం కొనుగోళ్లపై ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జి మంత్రి సహా ఎవ్వరూ దృష్టి పెట్టలేదు. దీంతో తీవ్ర ఆటంకాల మధ్య కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగింది. రేవంత్ మంత్రివర్గంలో చోటు కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న నేతలకు కూడా ప్రజాప్రయోజనాలు పట్టకపోవడం చర్చనీయాంశమైంది.


### రెడ్డి వర్సెస్ బీసీ వర్సెస్ మైనార్టీ..



మంత్రివర్గ విస్తరణలో సుదర్శన్‌రెడ్డి పేరు దాదాపుగా ఖరారైందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ నడుస్తున్న తరుణంలో తెరపైకి కొత్తగా మరికొంత మంది పేర్లు కూడా వినిపిస్తుండడం ఆసక్తి గొలుపుతున్నది. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, పీసీసీ ముఖ్య నాయకుడు షబ్బీర్ అలీ పేర్లు సైతం పరిశీలనలో ఉన్నట్లు జోరుగా చర్చ జరుగుతున్నది. అవసరమైతే నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి ఇద్దరికి మంత్రి పదవి దక్కే వీలున్నట్లు కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. అదే జరిగితే ఎవరెవరికి మంత్రి పదవి దక్కుతుందోనన్న ఆసక్తి హస్తం నేతల్లో కనిపిస్తున్నది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీ చేసిన వారిలో షబ్బీర్ అలీ మినహాయిస్తే మిగతా అంతా అగ్రవర్ణాలకు చెందిన వారే ఉన్నారు. బీసీలకు తీవ్రంగా అన్యాయం జరిగింది. చట్టసభల్లో బీసీలకు ఉమ్మడి జిల్లా నుంచి ప్రాధాన్యమే దక్కలేదు. మహేశ్‌కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్సీ ఇచ్చినప్పటికీ, ప్రత్యక్ష ఎన్నికల్లో చాలా మంది టికెట్ ఆశించగా భంగపాటుకు గురయ్యారు. ఇప్పుడు మంత్రివర్గ విస్తరణలో బీసీలకు పెద్దపీట వేస్తారా..? లేదంటే అగ్రవర్ణాలకు చోటు కల్పిస్తారా? అన్నది ఆసక్తి రేకెత్తిస్తున్నది. రేవంత్ కేబినెట్‌లో మైనార్టీ లీడర్లకు చోటు లేకుండా పోయింది. షబ్బీర్ అలీ పోటీ చేసి ఎమ్మెల్యేగా ఓడిపోవడంతో ఆ వర్గానికి స్థానమే కరువైంది. ఈ నేపథ్యంలో మైనార్టీ కోటాలో షబ్బీర్‌కు అమాత్యయోగం వరిస్తుందా.. లేదా? అన్నది వేచి చూడాల్సి ఉంది. మొత్తానికి ఉమ్మడి జిల్లాలో తాజా రాజకీయాన్ని పరిశీలిస్తే రెడ్డి వర్సెస్ బీసీ వర్సెస్ మైనార్టీ అన్న భావన కనిపిస్తున్నది. సుదర్శన్‌రెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్, షబ్బీర్ అలీల్లో ఎవరికి అమాత్యయోగం దక్కుతుందో కాలమే తేల్చనున్నది.

### చుట్టపు చూపుగా ఇన్‌చార్జి మంత్రి..

ఉమ్మడి రాష్ట్రంలో, స్వరాష్ట్రంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ఈ ప్రాంతానికి ఎల్లవేళలా ఆదరణ దక్కింది. కానీ మొదటిసారి రేవంత్ సర్కారులోనే మంత్రి పదవి లేక నిర్లక్ష్యానికి గురైంది. ఆర్నెళ్ల కాలంలో ఉమ్మడి జిల్లాకు మంత్రి లేకపోవడంతో పరిపాలన గాడి తప్పినట్లైందని కాంగ్రెస్ నేతలే చెబుతున్నారు. కార్పొరేషన్ పదవులు కట్టబెట్టినట్లుగా పేపర్ ప్రకటనలు చేశారు. అందులో నలుగురు నాయకులకు చోటు కల్పించారు. మూడు నెలలవుతున్నా జీవో మాత్రం రాలేదు. ఇక ప్రభుత్వ విప్ పదవుల్లోనూ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలకు చోటు లేకుండా పోయింది. కేవలం ప్రభుత్వ సలహాదారుగా షబ్బీర్ అలీకి బాధ్యతలు అప్పగించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం తొమ్మిది అసెంబ్లీ స్థానాలుంటే కామారెడ్డి జిల్లాలో రెండు చోట్ల, నిజామాబాద్ జిల్లాలో రెండు చోట్ల హస్తం పార్టీ గెలిచింది. ఇందులో సీనియర్ ఎమ్మెల్యేగా సుదర్శన్‌రెడ్డి ఒక్కరే ఉన్నారు. పీసీసీ ముఖ్య నాయకుడిగా షబ్బీర్ అలీ ఉన్నప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఓటమి చవిచూశారు. మంత్రివర్గ విస్తరణలో మొదట్నుంచి ఉమ్మడి జిల్లా నుంచి సీనియర్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, షబ్బీర్ అలీలకు చోటు దక్కుతుందని చర్చ నడుస్తున్నది. ఉభయ జిల్లాల్లో గెలిచిన ఎమ్మెల్యేల్లో ముగ్గురూ కొత్త వారే ఉన్నారు. జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి మొదటిసారి గెలిచిన వారే.



సన్మానం అనంతరం జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలతో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

## పండించే ప్రతి ఎకరానికీ రైతుబంధు ఇవ్వాలి

- విధివిధానాల పేరిట రుణమాఫీ చేయకుండా తాత్సారం
- ఉచిత బస్సు తప్ప ఏ హామీ అమలు కాలేదు..
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్/బాల్కొండ, జూలై 4: కేసీఆర్ నాయకత్వంలో ఐదేండ్లుగా మండలాలు, గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారంలో ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు చేసిన సేవలు మరవలేనివని మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బాల్కొండలోని క్యాంపు కార్యాలయంలో గురువారం పదవీకాలం పూర్తయిన ప్రజాప్రతినిధుల సన్మానసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్న మనం ప్రజలపక్షాన, రైతుల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా, కోతలు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుబంధు సక్రమంగా ఇవ్వకుండా ఊరూరా మీటింగ్‌లు పెట్టి కోతలు విధించే కార్యక్రమాలు చేపట్టడాన్ని ఆపి పంట పండిస్తున్న ప్రతి ఎకరానికి రైతుబంధును ఇవ్వాలన్నారు. అధికారంలోకి రాగానే రైతురుణమాఫీ చేస్తామని చెప్పి పూటకోమాట మారుస్తున్నారని, వీటన్నింటినీ రైతులు గమనిస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి 200రోజులు గడుస్తున్నా హామీల అమలు లేదు, అభివృద్ధి పనుల జాడలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కొందరు ఆఫీసులు పంచుకుంటే, మరి కొందరు ఇసుక రీచ్‌లు పంచుకుంటున్నారని, జేసీబీలు పెట్టి ఇసుకను తోడేస్తూ అక్రమంగా ఇసుకను రవాణాను చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పథకం ఏది అమలు కావాలన్నా చేతులు తడపనిదే పనికాదన్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. తనపై, బీఆర్‌ఎస్ నాయకులపై తప్పుడు ప్రచారాలు చేస్తూ వస్తున్నారని, ఎన్నికల్లో కూడా అదే చేసినా తన విజయాన్ని ఆపలేకపోయారన్నారు. మరికొన్ని రోజులు గడిస్తే కాంగ్రెస్‌పై వ్యతిరేకత వస్తుందని, ఇప్పటికే ప్రజలు కేసీఆర్ నాయకత్వమే కావాలని అభిప్రాయ పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క అభివృద్ధి పనీ చేయలేదని, చేసిన పనులకు బిల్లులు రావాలంటే పర్సంటేజీలు ముట్టాల్సిందేనన్నారు.

### పోచారం పార్టీ మారడాన్ని ప్రజలు ఈసడించుకున్నారు

సుదీర్ఘ అనుభవమున్న పోచారం శ్రీనివాసరెడ్డికి బీఆర్‌ఎస్ పార్టీ ఉన్నతమైన స్థానాన్ని కల్పించిందని, అయినా నాలుగు రోజులు కూడా అధికారంలో లేకుండా ఉండలేకపోయారని ఎమ్మెల్యే వేముల విమర్శించారు. ఎవరి ఒత్తిడితోనో, తాత్కాలిక లబ్ధి కోసమో పార్టీని వీడడంతో జిల్లా ప్రజలు ఈసడించుకున్నారన్నారు. పార్టీని వీడేవాళ్లు వీడతారని, వారి గురించి ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని, మళ్లీ ఎవరిని ఆదరించాలో వారికి తెలుసన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల పక్షాన పోరాడేందుకు సిద్ధం కావాలన్నారు. ప్రజల్లో మార్పు మొదలైందని, తిరిగి బీఆర్‌ఎస్‌ను ఆదరిస్తారన్నారు. గతంలో మాదిరిగానే ప్రతిపక్షంలో ఉండి ప్రజలకోసం పనిచేయాలని సూచించారు. జాబ్‌క్యాలెండర్ అని ఎప్పుడూ యువతను రెచ్చగొట్టే నాయకులు బల్మూరి వెంకట్, తీన్మార్ మల్లన్న పదవులు తీసుకుని పెదవులు మూసుకున్నారన్నారు. అందుకే వర్సిటీ నిరుద్యోగులు స్వచ్ఛందంగా తాము మోసపోయామని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉద్యమం మొదలు పెట్టారని, వారికి బీఆర్‌ఎస్ పార్టీ మద్దతుగా నిలుస్తోందన్నారు.

## నిరుద్యోగ ర్యాలీపై ఆంక్షలు

వినాయక్‌నగర్, జూలై 4: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో శుక్రవారం తలపెట్టనున్న నిరుద్యోగ ర్యాలీని విఫలం చేసేందుకు ప్రభుత్వం యత్నిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా హైదరాబాద్‌కు వెళ్లనున్న నిరుద్యోగ యువతను ఎక్కడికక్కడ కట్టడి చేస్తున్నది. నిజామాబాద్ జిల్లాలో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో పలువురు విద్యార్థి సంఘ నాయకులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మరోవైపు హైదరాబాద్ వెళ్లేందుకు విద్యార్థి నాయకులు, నిరుద్యోగులకు వాహనాలు అందుబాటులో లేకుండా ఆంక్షలు విధిస్తున్నట్లుగా తెలుస్తున్నది. హైదరాబాద్ ర్యాలీలో పాల్గొనేందుకు వెళ్లే నిరుద్యోగుల ఇండ్లపై పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని కట్టడి చేసేందుకు పోలీసులు రంగం సిద్ధంచేశారు.

## ప్రభుత్వ కార్యాలయంలో కాంగ్రెస్ నేతల ఫొటోలు

### ఎంపీడీవో కార్యాలయం ఎదుట బీజేపీ నాయకుల ధర్నా

భిక్కనూరు,జూలై 4: భిక్కనూర్ మండల పరిషత్ కార్యాలయంలో కాంగ్రెస్ నేతల ఫొటోలు పెట్టడంపై బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ కార్యాలయంలో కాంగ్రెస్ నేతల ఫొటోలు పెట్టిన ఎంపీపీ, ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట వారు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఎంపీడీవో కార్యాలయంలోని ఎంపీపీ గదిలో కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, షబ్బీర్ అలీల ఫొటోలు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఇదేమైనా కాంగ్రెస్ పార్టీ కార్యాలయమా అంటూ విమర్శించారు. కారకులైన ఎంపీపీపై కేసు నమోదు చేయాలని, ఎంపీడీవోపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల్లో వినతిపత్రం అందించినట్లు తెలిపారు.



ఎంపీపీ గదిలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ నేతల ఫొటోలు



భిక్కనూరు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు